సాక్షి
మెదక్
మంగళవారం। 14। మార్చి। 2023



గుట్టలన్నీ తోడేస్తున్నారు

8లో..


మట్టిదందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమార్కులు కొండపాక మండలంలోని గుట్టలను తోడేస్తూ వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



దారిదోపిడీ

8లో..

ఐదుగురు దొంగలు దారి దోపిడీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రితో వెళ్తున్న డీసీఎం డ్రైవర్‌ను తుపాకీతో బెదిరించి సామగ్రిని ఎత్తుకెళ్లారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించరూ..

నిత్యం రద్దీగా ఉండే రోడ్డు పక్కన ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. 9లో..

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మెదక్‌జోన్: ఈనెల 15వ తేదీన విద్యుత్ వినియోగదారుల పరిష్కార సదస్సును జిల్లా కేంద్రంలోని డీఈ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ట్రాన్స్ ఎస్ఈ జానకిరాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో లో ఓల్టేజీ, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో సర్పంచ్‌లు



వెల్దుర్తి(తూప్రాన్): హైదరాబాద్‌లో జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఎన్సీపీసీఆర్, ఎస్ఐఆర్డీ, ఎస్సీపీసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ భారత రీజియన్‌స్థాయి ఓరియెంటేషన్ కార్యక్రమానికి జిల్లా నుంచి మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, పూలపల్లి సర్పంచ్ యాదగిరి యాదవ్‌కు ఆహ్వానం అందింది. గ్రామీణ విద్యా విధానం, విద్యా హక్కు, బాలల సంరక్షణ, గ్రామీణ అభివృద్ధి అంశాలపై పంచాయతీ రాజ్ విభాగం, స్థానిక సంస్థల పాత్ర, బాధ్యతలపై పలువురు వక్తలు వివరించారు.

సర్వర్‌డౌన్.. ఉపాధి నిల్



చెన్నాయిపల్లిలో ఉపాధి కూలీలు

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధి కూలీలకు కొత్త సాఫ్ట్‌వేర్ ఇబ్బంది తెచ్చిపెడుతోంది. మండలంలోని మడూర్, చెన్నాయిపల్లి, ఎస్.కొండాపూర్, ఖాజాపూర్ తదితర గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. ఎన్ఎంఎంఎస్ విధానం ద్వారా పనుల ఫొటోతో పాటు నిర్వహిస్తున్న కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే పనులు చేస్తున్నట్లు గుర్తించే విధానం అమలులోకి వచ్చింది. దీంతో ఫొటో కప్చర్ అయితేనే పనులు చేసినట్లు గుర్తిస్తారు. అయితే మండలంలోని చెన్నాయిపల్లిలో మూడు రోజులుగా సర్వర్ ప్రాబ్లమ్‌తో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఫొటో రావడం లేదని పనులు నిలిపివేశారు. ఈవిషయంపై ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రామాయంపేట (మెదక్): రామాయంపేట నుంచి దౌల్తాబాద్ రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ అధికారులు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వారితో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తీరని దాహం!

- విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- జిల్లాలో పది పాఠశాలలు, ఐదు కళాశాలలు



మెదక్ కేజీబీవీలో..

కేజీబీవీల్లో పనిచేయని ఆర్వోప్లాంట్లు



చిన్నశంకరంపేట కేజీబీవీలో నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్

మెదక్‌జోన్: కేజీబీవీల్లో ఆర్వో ప్లాంట్లు అలంకారప్రాయంగా మారాయి. విద్యార్థులకు శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లో ఆర్వోప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అయితే ఇవి చిన్నపాటి మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో అన్ని పాఠశాలల్లో యంత్రాలు మూలనపడ్డాయి. ఫలితంగా బాలికలకు రక్షిత తాగునీరు కరువైంది. నల్లానీటిని తాగుతూ తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

- జిల్లావ్యాప్తంగా 15 కేజీబీవీలు ఉండగా వాటిలో మెదక్, అల్లాదుర్గం, నర్సాపూర్ మండలం చిప్పతుర్తి, మనోహరాబాద్, చేగుంటలో అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ వరకు పెంచారు.
- బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలనే సంకల్పంతో 2007లో అప్పటి ప్రభుత్వం కేజీబీవీ ఉన్నత పాఠశాలలను మండలానికొకటి ఏర్పాటు చేసింది. అనంతరం 2018లో వీటిలో కొన్నింటిని కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది.
- ఈపాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు శుద్ధజలాలు అందించాలనే ఉద్దేశంతో రూ. లక్షలు ఖర్చు చేసి ప్రతి పాఠశాలలో తాగునీటి యంత్రాలు (ఆర్వోప్లాంట్లు) ఏర్పాటు చేసింది.
- కొన్ని నెలల పాటు ఇవి సక్రమంగా నడిచాయి. యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో పట్టించుకునే వారే కరువయ్యారు.

'జలమణి' పేరుతో ఏర్పాటు

- కేజీబీవీ విద్యాలయాల్లో చదువుతున్న బాలికలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం జలమణి పథకం కింద ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేసింది.
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు నిధులు వెచ్చించి ప్లాంట్ల నిర్వాహణను ఓ సంస్థకు అప్పగించింది.
- అయితే యంత్రాలు అమర్చిన కొంత కాలానికే అవి మూలన పడ్డాయి. కొన్నిచోట్ల పరికరాలు పగిలిపోగా.. మరికొన్ని చోట్ల ప్లాంట్లు పాడైపోయాయి.
- వీటికి మరమ్మతులు చేయించాలని నివేదికలు పంపినా ప్రయోజనం లేకుండా పోయింది.

బయటి నుంచే తాగునీరు

- పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు పనిచేయకపోవడంతో బయటి నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు.
- చాలా పాఠశాలల్లో విద్యార్థులు మిషన్ భగీరథ నీరే తాగుతున్నారు. ఫలితంగా తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు.
- జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో తాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.
- పాడైన ఆర్వోప్లాంట్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఏడేళ్లుగా జీసీడీఓ పోస్టు ఖాళీ

కేజీబీవీ పాఠశాలలకు గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీఓ) ఉంటారు. కానీ జిల్లాలో 2016 నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే అకాడమీ మానిటరింగ్ (ఏఎంఓ), ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి (ఎఫ్ఏఓ) పోస్టు సైతం చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఏమైనా సమస్య వస్తే ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థినులు వాపోతున్నారు.

వైద్య సేవలకు అధిక ప్రాధాన్యం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



గోమారంలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోమారంలో పల్లె దవాఖానాను ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అలాగే మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు మహిళా సంఘాలకు పావలా వడ్డీ చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళా సంఘాలను బాలోపేతం చేసేందుకు ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలను మంజూరు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తుందన్నారు. మంత్రి హరీశ్‌రావు కృషితో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి సిబ్బంది నియామకం చేపట్టడంతో పాటు మహిళల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్య సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. ధ్వంసమైన గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. త్వరలోనే అందుకు సంబంధించిన నిధులు మంజూరు కానున్నాయని చెప్పారు. గోమారం అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ లావణ్య కోరగా సానుకూలంగా స్పందించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ లాయక్, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు, పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

శివ్వంపేట(నర్సాపూర్): గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ఆరోగ్య పరిశుభ్రత, పోషక దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సూచించిన విధంగా వ్యవహరించాలన్నారు. మెనూ ప్రకారం సరుకులు పంపిణీ చేయాలని.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సాయిసౌమ్య, సంధ్య, సూపర్‌వైజర్ సంతోష, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ప్రజల డబ్బు దోచుకుంటున్నారు



మాట్లాడుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: సీఎం కేసీఆర్ ప్రజలకు చిన్న చిన్న పథకాలు ఇచ్చి ఆయన కుటుంబం మాత్రం ప్రజల డబ్బును దోచుకుంటుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీయాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చేయని తప్పుకు పార్టీ నుంచి సస్పెండ్ చేశారని.. ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ స్కాం ఆరోపణలు వచ్చినా పార్టీపరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఢిల్లీలో ధర్నా చేయించారని ఆయన ఆరోపించారు. కాగా రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరిగినా స్పందించని మహిళా కమిషన్ బండి సంజయ్ వ్యాఖ్యలను మాత్రం సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేశారని వాపోయారు. సమావేశంలో కౌన్సిలర్లు రాజేందర్, యాదగిరి, బుచ్చేశ్‌యాదవ్, నాయకులు ఆంజనేయులుగౌడ్, రమేష్‌యాదవ్, పాండురంగారెడ్డి, ఆదిలింగం, తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ

మెదక్ కలెక్టరేట్: ఈనెల 15 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు 13,616 మంది విద్యార్థులు హాజరుకానున్నారని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,999, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,086 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీని నియమించామని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రాన్ని సరిచూసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా సెంటర్‌లోకి అనుమతించమన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటల వరకే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా సిద్ధం కావాలన్నారు. హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఫీజుల పేరిట విద్యార్థులకు హాల్‌టికెట్లను నిలిపివేస్తే ప్రైవేట్ యాజమాన్యాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సందేహాలు ఉంటే జిల్లాస్థాయి కంట్రోల్ రూం ఫోన్ నంబర్లు 7671033323, 9603615652కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

ఏర్పాట్లు పూర్తి చేశాం: కలెక్టర్

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓ సాయిరాం,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డాక్టర్ కిరణ్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు మేలు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, పక్కన వంటేరు ప్రతాప్‌రెడ్డి

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): కంటి వెలుగు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు పథకంలో పేదలకు కంటి అద్దాలు ఇవ్వడంతో పాటు చికిత్స సైతం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీత రవి, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మీనర్సింలు, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ లతా వెంకట్‌గౌడ్, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, కాళ్లకల్ సర్పంచ్ నత్తి మల్లేష్, నాయకులు చంద్రశేఖర్, భిక్షపతి, జావీద్‌పాషా, వైద్యులు ఆనంద్, జ్యోత్సదేవి, కార్యదర్శి రూపగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న బుకింగ్ ఆదాయం రూ.65.86 లక్షలు



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో ఆదివారం బుకింగ్ ఆదాయం రూ.65,86,147 రాగా.. సోమవారం మరో ఆరు లక్షల రూపాయల బుకింగ్ ఆదాయం వచ్చే అవకాశం ఉందని బుకింగ్ ఇన్‌చార్జి మాధవి తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు మొక్కుబడులుగా తలనీలాలు, పట్నాలు, బోనాలు, ఆర్జిత సేవలు నిర్వహించారు. ప్రత్యేక దర్శనాలు, ప్రసాద విక్రయాలు, వసతి గదుల అద్దె తదితర వాటి ద్వార శనివారం రూ. 4,18,303, ఆదివారం రూ.61,67,844 ఆదాయ వచ్చిందన్నారు. గతేడాది 8వ వారం వచ్చిన ఆదాయ కంటే ఈ సారి రూ.17 లక్షలు అధికంగా వచ్చినట్లు అధి కారులు తెలిపారు. బుకింగ్ ఆదాయం పెరగడంతో ఈఓ బాలాజీ హర్షం వ్యక్తం చేశారు.

సత్వర పరిష్కారానికి కృషి చేయండి

- కలెక్టర్ రాజర్షిషా
- ప్రజావాణికి 113 అర్జీలు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పరిష్కార దిశగా కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం డీఆర్‌డీఓ శ్రీనివాస్‌తో కలిసి ప్రజావాణి వినతులను స్వీకరించారు. మొత్తం 113 అర్జీలు రాగా.. అందులో ప్రధానంగా ధరణి, భూ సమస్యలు, భూ సర్వే, పౌతి, ఆస్తి తగాదాలు, పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించినవి ఉన్నాయి. పిల్లికొట్టాల్‌లో మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. భూ సమస్యలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ఆయా మండలాల తహసీల్దార్లకు పంపించారు. సమగ్ర నివేదికలు తెప్పించాలని కలెక్టరేట్ ఏఓ యూనుస్‌కు సూచించారు. ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

హాజరుకాని అధికారులపై చర్యలు

ప్రజావాణికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఏఓను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం గడువు ముగియనున్నందున ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం అధిగమించాలని అధికారులకు సూచించారు. బ్యాంకర్లు కూడా రుణ వితరణకు సహకరించాలని కోరారు. మండల ప్రత్యేకాధికారులు వారంలో కనీసం రెండు రోజులు మన ఊరు- మన బడి కింద జరుగుతున్న పనులను పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. అదేవిధంగా కంటి వెలుగు శిబిరాలను సందర్శించి రోజు 150 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు నిర్వహించేలా కృషి చేయాలన్నారు. మహిళా క్లినిక్‌ను మహిళలు అధిక సంఖ్యలో వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రహదారుల వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పిల్లలలో గ్రోత్ మానిటరింగ్ చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారికి సూచించారు. అనంతరం జిల్లాలోని 261 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు జియో సిమ్ కార్డులను అందజేశారు. కార్యాక్రమంలో జిల్లా అధికారులు శ్రీనివాస్, విజయశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, సాయిబాబ, జానకిరామ్‌సాగర్, రవి ప్రసాద్, నాగరాజు, బ్రహ్మాజీ, ఇందిర, ఆశాకుమారి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఉత్సాహంగా పాచిబండ్ల ఊరేగింపు

భారీగా హాజరైన భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్)/టేక్మాల్(మెదక్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు నిర్వహించిన పాచిబండ్ల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. వివిధ చోట్ల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అలాగే టేక్మాల్‌లో గ్రామ దేవతలు దుర్గమ్మ–పోచమ్మల జాతర సోమవారం సర్పంచ్ నాయికోటి సుప్రజా భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది.



టేక్మాల్‌లో బండ్ల ఊరేగింపు



కౌడిపల్లి: ఆలయం వద్ద పాచిబండ్ల ఊరేగింపు

క్లుప్తంగా

ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ భీంరెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని..నేరాలను అరికట్టడంలో వీటి పాత్ర కీలకమని పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ఐనోల్‌ గ్రామంలో మాజీ సర్పంచ్‌ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలసి డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం భీంరెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు సబ్‌డివిజన్‌ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం సీఐ బీసన్న, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్నవారిపై కేసు

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.15,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నాగసముద్రాల గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం పోలీసులకు అందింది. దీంతో స్థావరంపై దాడి చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

నిల్వ ఉంచిన పత్తి దగ్ధం



దుబ్బాక: ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి దగ్ధమైంది. ఈ ఘటన రాయపోల్‌ మండలం అనాజీపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు జెగ్గ కుమార్‌, జెగ్గ యాదగిరిలు సరైన ధర లేక పత్తిని అమ్మకుండా ఇంటిసమీపంలోని పశువులపాకలో నిల్వ చేశారు. ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలంటుకొని సుమారు పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది.

షార్ట్‌ సర్క్యూట్‌తో పూరిగుడిసె...



దుబ్బాక: విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా పూరిగుడిసె దగ్ధమైంది. మండల పరిధిలోని సయ్యద్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన నజీయా–పఠాన్‌ గౌస్‌ దంపతులు రాయి కొడుతూ జీవనం సాగిస్తున్నారు. పూరిగుడిసెలో నివసిస్తున్నారు. సోమవారం విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసెకు అంటుకున్నాయి. స్థానికులు మంటలార్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. గుడిసెలో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు, మంటల్లో పూర్తిగా కాలిపోయాయి.

గుట్టలన్నీ తోడేస్తున్నారు

అధికారులకు కనిపించని మట్టిదందా

కొండపాక(గజ్వేల్‌): మట్టిదందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లలోకి మట్టితరలింపు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

- మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి, కొండపాక గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లోని గుట్టలను తోడేస్తున్నారు.
- కుకునూరుపల్లి, ముద్దాపూర్‌ గ్రామాల శివారులో తవ్విన కాలువల మట్టిని గజ్వేల్‌ పట్టణ శివారులో వెలుస్తున్న వెంచర్లలోకి తరలిస్తున్నారు.
- వెలికట్ట, దుద్దెడ, జప్తినాచారం, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, మేదినీపూర్‌, కుకునూరుపల్లి గ్రామ శివారులోని వందలాది ఎకరాల్లో వెంచర్లు వెలిశాయి.
- దీంతో సమీప గ్రామాల్లోని ప్రభుత్వభూముల్లో ఉన్న మట్టిపై కొందరు రియల్టర్ల కన్ను పడింది.
- రోజుకు లక్షల రూపాయల్లో దందా సాగుతున్నా రెవెన్యూ, మైనింగ్‌ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది.
- తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టకు ఇటాచీ, జేసీబీలతో రోజూ వందలాది ట్రిప్పుల మట్టిని తరలించుకుపోతున్నారు.
- నిత్యం రాజీవ్‌ రహదారిపై ఈ దందా సాగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- ముఖ్యంగా రాత్రి వేళల్లో మట్టి లోడుతో టిప్పర్లు స్పీడుగా వెళుతున్నాయి. దీంతో బైక్‌లపై వెళ్లేవారు భయపడిపోతున్నారు.



కుకునూరుపల్లి శివారులోని కాలువ నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం



తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో ఇలా..

- ఈవిషయమై తహసీల్దార్‌ రామేశ్వర్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు.





ఎండలు ముదరకముందే...
ఎండిపోతున్నయ్‌

ఎండలు ఇంకా ముదరకముందే...రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. బోర్లలో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో వరి పంట ఎండిపోతున్నది. కొల్చారం మండలపరిధిలోని పచ్చగా ఉండాల్సిన వరి పొలం ఎండిపోవడంతో పశువులను మేపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

– కొల్చారం(నర్సాపూర్‌)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

సిద్దిపేట, మెదక్‌ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు.

ఆటోను ఢీకొన్న డీసీఎం



సంఘటన స్థలంలో లక్ష్మి మృతదేహం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ఆటోను డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. సోమవారం ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ తెలిపిన వివరాల ప్రకారం...యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి హుస్నాబాద్‌కు ఓ డీసీఎం వస్తూ మండల పరిధిలోని రామవరం గ్రామశివారులోని మూలమలుపు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీరాముల లక్ష్మి(55) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ప్రయాణికురాలు మ్యాన రాజేశ్వరి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. డ్రైవర్‌కు కూడా గాయపడ్డాడు. 108లో వీరిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఓ చావుకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

కారు ఢీకొని...

గజ్వేల్‌రూరల్‌: రెండు బైక్‌లను ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. సోమవారం గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మర్కుక్‌ మండలం పాతూరుకు చెందిన గుర్రాల విజయేందర్‌(31) పల్సర్‌పై గౌరారం నుంచి స్వగ్రామానికి తిరిగి రాజీవ్‌ రహదారిపై వస్తున్నాడు. ఇదే క్రమంలో ఎన్సాన్‌పల్లికి చెందిన బొల్లం మనోహర్‌ కారులో బాబుతో కలిసి హైదరాబాద్‌ నుంచి సిద్దిపేటకు వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని పాతూరు కూరగాయల మార్కెట్‌ సమీపంలో బైక్‌పై వెళుతున్న విజయేందర్‌తో పాటు మరో బైక్‌పై వెళుతున్న సయ్యద్‌ అజీజ్‌–మదియా దంపతులను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విజయేందర్‌కు తీవ్ర గాయాలు కాగా, సయ్యద్‌ అజీజ్‌, మదియా దంపతులతో పాటు కారులో ఉన్న బాబుకు కూడా గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయేందర్‌ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నరేష్‌ తెలిపారు.



విజయేందర్‌(ఫైల్‌)

బైక్‌ అదుపు తప్పి..

మెదక్‌ రూరల్‌: బైక్‌ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...మండల పరిధిలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఉడత యాదగిరి(41) మెదక్‌కు వెళ్లాడు. తిరుగు పయనంలో ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యలో బైక్‌ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాడు. దీంతో యాదగిరి తలకు తీవ్ర గాయాలపై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.



యాదగిరి(ఫైల్‌)

దారిదోపిడీ

తుపాకీతో డ్రైవర్‌కు బెదిరింపులు

పటాన్‌చెరు టౌన్‌: ఐదుగురు దొంగలు దారిదోపిడీకి పాల్పడ్డారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సామగ్రితో వెళుతున్న డీసీఎంను అడ్డగించారు. డ్రైవర్‌ను తుపాకీతో బెదిరించి సామగ్రిని అపహరించుకున్నారు. ఈ ఘటన భానూర్‌–బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సోమవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ వినాయక్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఫ్లిప్‌ కార్ట్‌ కంపెనీ నుంచి గజ్వేల్‌కు ఓ డీసీఎం వెళుతుండగా, పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూర్‌ సర్వీస్‌ రోడ్డు వద్ద ఐదుగురు కారులో వచ్చి అడ్డగించారు. డీసీఎం డ్రైవర్‌ను బలవంతంగా తమ వాహనంలో ఎక్కించుకున్నారు. కళ్లకు గంతలు కట్టారు. ఎందుకు ఇలా చేస్తున్నారని అడిగేలోపు తుపాకీతో బెదిరించారు. ఓ గంట తర్వాత కారులోంచి దింపారు. కళ్లకు కట్టిన గంతలు విప్పుకొని చూడగా, సుల్తాన్‌పూర్‌ ఎగ్జిట్‌–4 సర్వీస్‌ రోడ్డు వద్ద ఉన్నాడు. కొద్దిదూరంలో డీసీఎం ఉంది. అక్కడకు వెళ్లి చూడగా, డీసీఎంలో ఉన్న 20 బ్యాగులు కనిపించలేదు. సుమారు 1,78,000 విలువైన వస్తువులు చోరీ అయ్యాయని గుర్తించాడు. వెంటనే బాధితుడు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాడు. సంఘటన స్థలానికి వెళ్లాక పోలీసులు ఇది భానూర్‌–బీడీఎల్‌ ఠాణా పరిధిలోకి వస్తుందని వారికి సమాచారం ఇచ్చారు. డ్రైవర్‌ ఎండీ సత్తార్‌ ఫిర్యాదు మేరకు బీడీఎల్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దోపిడీ జరిగింది ఈ డీసీఎంలోనే

మందు తాగొద్దన్న భార్య.. ఆత్మహత్యకు యత్నించిన భర్త

మెదక్‌ రూరల్‌: మద్యం మానేయమని భార్య హెచ్చరించడంతో మనస్తాపానికి లోనైన భర్త పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండలపరిధిలోని మంబోజిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మంగళిగుట్ట తండాకు చెందిన మాలోతు సూర్య–కవిత దంపతులు కూలీ పనులు చేస్తున్నారు. సూర్య తాగుడుకు బానిసై వచ్చిన డబ్బంతా ఖర్చు చేస్తుండడంతో దంపతుల నడుమ కలహాలు మొదలయ్యాయి. మెదక్‌ నుంచి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తూ కల్లు కోసం మధ్యలో ఆగారు. మద్యం ప్రస్తావన వచ్చి గొడవ జరగ్గా, సూర్య క్షణికావేశంలో వాహనంలోకి తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలను చల్లార్చి 108కు సమాచారమిచ్చారు. అక్కడి నుంచి మెదక్‌ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

స్నేహితుడితో గొడవపడి...

పటాన్‌చెరుటౌన్‌: స్నేహితుడితో గొడవ జరిగాక ఒకరు కనిపించకుండాపోయారు. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం...మండల పరిధిలోని ఇస్నాపూర్‌ వడ్డెరకాలనీకి చెందిన లక్ష్మణ్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన మద్యంమత్తులో లక్ష్మణ్‌, స్నేహితుడు నరసింహులు గొడవపడ్డారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదుగానీ లక్ష్మణ్‌ కనిపించకుండాపోయాడు. ఫోన్‌ చేస్తే స్విచ్ఛాఫ్‌ వస్తోందని లక్ష్మణ్‌ తల్లి పోచమ్మ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మణ్‌ (ఫైల్‌)

బీదర్‌లో సరిహద్దు పోలీసుల సమావేశం



సమావేశంలో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు

జహీరాబాద్‌: జహీరాబాద్‌కు సమీపంలోని కర్ణాటక పరిధిలోని బీదర్‌లో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు సోమవారం సమావేశం అయ్యారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున తెలంగాణ – కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ముందస్తుగా పోలీసు చెక్‌ పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని మిస్సింగ్‌ కేసులను చేధించాలని, అంతర్‌రాష్ట్ర నిందితులను అరెస్ట్‌ చేసేందుకు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. గుర్తింపునకు నోచుకోని మృతుల కేసులను గుర్తించేందుకు, డ్రగ్స్‌, మట్కాలను నిర్మూలించేందుకు ఇరు రాష్ట్రాలకు చెందిన పోలీసులు పరస్పరం సహకరించుకోవాలని సమావేశంలో నిర్ణయానికి వచ్చారు. సమావేశంలో బీదర్‌ ఎస్పీ చెన్నబసవన్న, అదనపు ఎస్పీ మహేశ్‌, జహీరాబాద్‌, నారాయణఖేడ్‌ డీఎస్పీలు వి.రఘు, వెంకట్‌రెడ్డి, జహీరాబాద్‌ సీఐ తోట భూపతి, సంగారెడ్డి డీఆర్‌సీబీ సీఐ బి.రమేశ్‌, సంగారెడ్డి, నిజామాబాద్‌, నాందేడ్‌, కల్‌బుర్గి జిల్లాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్‌ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



మహేందర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మహేందర్‌రెడ్డి అంతిమయాత్ర

దుబ్బాకరూరల్‌: మధ్యప్రదేశ్‌ భోపాల్‌లోని బీఎస్‌ఎఫ్‌ శిక్షణ కేంద్రం నుంచి జవాన్‌ బొంగురం మహేందర్‌రెడ్డి(25) మృతదేహం సోమవారం తెల్లవారుజామున స్వగ్రామమైన దుబ్బాక మండలం చీకోడ్‌ గ్రామానికి చేరుకుంది. ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌ నుంచి తీసుకొచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన అంత్యక్రియలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువకులు జై జవాన్‌ జై కిసాన్‌, భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. మహేందర్‌రెడ్డి మృతి పట్ల ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. బీఎస్‌ఎఫ్‌ అధికారులు భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనం చేశారు. దుబ్బాక సీఐ కృష్ణ, ఎస్‌ఐ మహేందర్‌, సర్పంచ్‌ శ్రీనివాస్‌, ఎంపీటీసీ రాంరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

హత్యకు కుట్ర చేస్తున్నారు.. రక్షణ కల్పించండి

మెదక్‌ మున్సిపాలిటీ: తనపై హత్యకు కుట్ర చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోరుతూ మెదక్‌ మున్సిపల్‌ చైర్మన్‌, రైస్‌మిల్లర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్‌ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నర్సాపూర్‌కు చెందిన రైస్‌మిల్లర్‌ శ్రీధర్‌ గుప్తా నిబంధనలకు వ్యతిరేకంగా సివిల్‌ సప్లైకి బియ్యం సరఫరా చేసేందుకు ప్రయత్నించగా డీఎస్‌ఓకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈవిషయంలో కక్షగట్టిన శ్రీధర్‌గుప్తా బీహార్‌ కూలీలతో చంపించేందుకు కుట్ర పన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని జనవరిలో మరో రైస్‌మిల్లర్‌ ద్వారా తెలిసినప్పటికీ ఎవరికి ఫిర్యాదు చేయలేదన్నారు. ఇటీవల వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ వాట్సాప్‌ మెసేజ్‌ ద్వారా బెదిరిస్తున్నాడని వాపోయారు.



ఎస్పీ కార్యాలయ అధికారికి ఫిర్యాదు చేస్తున్న మెదక్‌ మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రపాల్‌

అదృశ్యమై.. ఆపై చెరువులో శవమై

హత్య చేసినట్టు అనుమానం

శివ్వంపేట(నర్సాపూర్‌): రెండురోజుల క్రితం కనిపించకుండాపోయిన ఓ వ్యక్తి చెరువులో శవమై తేలాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌ మండలం అల్లాపూర్‌ గ్రామానికి చెందిన మన్నే ఆంజనేయులు(45) కుటుంబం గజ్వేల్‌లో నివాసముంటోంది. దొంతిలోని ఓ ఫామ్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నుంచి ఆంజనేయులు కనిపించకపోవడం, సెల్‌ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసి ఉండడంతో ఆదివారం భార్య పద్మ శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం దొంతి గ్రామంలోని కుందలమ్మ చెరువులో ఆంజనేయులు మృతదేహం వెలుగుచూసింది. తలకు బలమైన గాయంతో పాటు శరీరంపై పలు చోట్ల గాయాలు ఉన్నారు. ఆంజనేయులుని హత్యచేసి చెరువులో పడేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానితుల వివరాలు ఆంజనేయులు కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్‌ సీఐ శ్రీధర్‌ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడు భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.



ఆంజనేయులు(ఫైల్‌)

గుండెపోటుతో బీజేపీ నేత మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలపరిధిలోని అయినాపూర్‌కు చెందిన బీజేపీనేత గన్నెబోయిన నర్సింహులు(48) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దండ్యాల వెంకట్‌రెడ్డి, గ్రామసర్పంచ్‌ చెరుకు రమణారెడ్డి, వైస్‌ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు.



నర్సింహులు (ఫైల్‌)

కస్టమర్‌ కేర్‌ అని కాల్‌ చేస్తే...

రూ.1,66,128 మాయం

మద్దూరు(హుస్నాబాద్‌): గూగుల్‌ వెబ్‌సైట్‌లో ఓ కస్టమర్‌ కేర్‌ నంబరు తీసుకొని కాల్‌ చేసి ఓ ఉపాధ్యాయుడు డబ్బు పోగొట్టుకున్నాడు. ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని మర్మాముల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇద్దగిరి సిద్దయ్య సెల్‌ఫోన్‌లో వాట్సాప్‌ పని చేయలేదు. గూగుల్‌ వెబ్‌సైట్‌తో వెతికి ఓ కస్టమర్‌ నంబరుకు కాల్‌ చేశాడు. అవతలి వ్యక్తి మాయమాటలు నమ్మి ఫోన్‌లో ఏనీ డెస్క్‌ యాప్‌ ఇన్‌స్టాల్‌ చేశాడు. దీంతో ఆయన అకౌంట్‌ నుంచి రూ.1,66,128 మాయమయ్యాయి. దీంతో తాను మోసపోయానని భావించిన ఆ టీచర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అపరిచిత కాల్స్‌.. అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ శ్వేత

సిద్దిపేటకమాన్‌: అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌ కాల్స్‌ పట్ల జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట పోలీస్‌కమిషనర్‌ శ్వేత సూచించారు. సైబర్‌ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. సోమవారం సిద్దిపేట పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో జరిగిన సైబర్‌ నేరాల వివరాలు ఆమె తెలిపారు.

- సిద్దిపేట త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తికి అమెజాన్‌లో సూపర్‌వైజర్‌ ఉద్యోగం ఉందని, ఇందుకుగాను కొంత మొత్తం డబ్బు చెల్లించాలంటూ గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. దీంతో ఆయనకు రూ.1550 ఆన్‌లైన్‌లో పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్‌ చేయగా ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్‌ నంబరు 1930కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.
- గజ్వేల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని ఒకరు ఫోన్‌ చేసి మీకు లోన్‌ అవసరం ఉందా అని అడిగాడు. దీంతో బాధితుడు లోన్‌ అవసరమని చెప్పగా, కొన్ని డాక్యుమెంట్లు పంపిస్తే...తమకు సంబంధించిన వ్యక్తి ప్రత్యక్షంగా వచ్చి వెరిఫికేషన్‌ చేసి లోన్‌ ఇస్తామని నమ్మించాడు. ఆ తర్వాత బాధితుడు పంపిన ఆ అడ్రస్‌కు లోన్‌ వెరిఫికేషన్‌ కోసమంటూ ఓ వ్యక్తి వచ్చాడు. ప్రాసెసింగ్‌ చార్జీల నిమిత్తం కొంత డబ్బు చెల్లించాలన్నాడు. దీంతో బాధితుడు కొంత నగదు, మరి కొంత ఆన్‌లైన్‌లో మొత్తంగా రూ.33,800 కోల్పోయాడు.



- బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో రెడ్‌మీ ఫోన్‌ ఆఫర్‌లో తక్కువ ధరకు వస్తుందనే యాడ్‌ చూశాడు. ఆ లింకుపై క్లిక్‌ చేసి ఆన్‌లైన్‌లో రూ.1,999 చెల్లించాడు. తర్వాత ఫోన్‌ చేయగా స్పందన లేదు.
- గజ్వేల్‌ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వాట్సాప్‌నకు బిట్‌కాయిన్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌ చేస్తే లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్‌ చేశాడు. అది నమ్మిన బాధితుడు రూ.1,45,000 పెట్టుబడి పెట్టాడు. కొంత మొత్తం లాభం వచ్చినట్టుగా చూపించాడు. కానీ ఆ డబ్బులు విత్‌డ్రా చేసుకోవడానికి వీలులేకుండా ఉంది. దీంతో సైబర్‌ నేరం జరిగినట్టుగా గుర్తించి బాధితుడు 1930 నంబరుకు ఫిర్యాదు చేయగా, పోలీసులు రూ.50వేలు ఫ్రీజ్‌ చేశారు.
- సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఓ లింకు పంపాడు. బాధితుడు అది ఓపెన్‌ చేయగా రూ.659 పోగొట్టుకున్నాడు. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌ నంబరుకు ఫిర్యాదు చేయగా రూ.659 ఫ్రీజ్‌ చేశారు.